# బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ తదితరులు

- ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలి
- ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్18: బీఆర్ఎస్‌తోనే హుజూరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమని, ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రజలను కోరారు. శనివారం సిటీ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తిరిగి మూడోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సంపూర్ణ ప్రగతి చెందుతుందని, నిరుద్యోగులకు కూడా పుష్కలంగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. కానీ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, వాటిని ప్రజలు ఓటు ద్వారా తిప్పి కొట్టాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందాయన్నారు. 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీజేపీల తప్పుడు హామీలను తిప్పి కొట్టి, సెక్యులర్ పార్టీ అయినా బీఆర్ఎస్‌ని ఆదరించాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి పిలుపు మేరకు జమ్మికుంటలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి లక్షకు పైగా తరలివచ్చి నిండు మనసుతో ఆశీర్వదించారని పేర్కొన్నారు. సభకు వచ్చిన ప్రతి ఒక్కరికీ బండ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని రూ.వెయ్యి కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వర్ధినేని రవీందర్‌రావు, రావుల రాజలింగారెడ్డి, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ భూసారపు బాపూరావు, కాట్రపల్లి మాజీ సర్పంచ్ తొగరు భిక్షపతి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు బీఎస్ ఇమ్రాన్, బీఆర్ఎస్‌వై నియోజకవర్గ నాయకుడు తొగరు శివకృష్ణ, నాయకులు కొలిపాక సమ్మయ్య, సంపంగి రాజేందర్, రాపర్తి అన్నయ్యలింగం, సమ్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.


పెద్దపాపయ్యపల్లిలో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

# ఆపద వస్తే అండగా ఉంటా

- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా
- బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి
- హుజూరాబాద్ మండలంలో ప్రచారం

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 18: అర్ధరాత్రయినా సరే పిలిస్తే పలుకుతా.. ఆపద వస్తే తోబుట్టువులా అండగా ఉంటా.. ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వేడుకున్నాడు. శనివారం మండలంలోని చిన్నపాపయ్యపల్లి, పెద్దపాపయ్యపల్లి, కాట్రపల్లి, పట్టణ పరిధిలోని దమ్మక్కపేట, ఇప్పల నర్సింగాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదిస్తే రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక కేసీఆర్ మన రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపారని గుర్తుచేశారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు, రైతుబంధు, బీమా వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు.

## రాబందులు వస్తున్నారు జాగ్రత్తగా ఉండాలి : మాజీ మంత్రి పెద్దిరెడ్డి

తెలంగాణ రాష్ట్రం రాక ముందు కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లు పాలించినా ఎలాంటి అభివృద్ధి జరుగలేదని మాజీ మంత్రి, హుస్నాబాద్ హుజూరాబాద్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక అభివృద్ధి జరిగిందని, దీన్ని అడ్డుకోవడానికి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన రాబందులు వస్తున్నాయని, జాగ్రత్తగా లేకుంటే నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పాడి శాలిని, సింగిల్ విండో చైర్మన్ కొండాల్‌రెడ్డి, సర్పంచ్‌లు దేవేంద్ర–కొండాల్‌రెడ్డి, రజిత–దయాకర్‌రెడ్డి, నిరోషా–కిరణ్‌కుమార్, ఎంపీటీసీలు శిరీషా–ముకుందారెడ్డి, అనిత–వెంకట్, పార్టీ మండల అధ్యక్షుడు సంగెం ఐలన్న, నాయకులు పొల్సాని రజనీకాంత్‌రావు, రవీందర్‌రావు, పోరెడ్డి వెంకట కిషన్‌రెడ్డి, శంతన్‌రెడ్డి, రమణారెడ్డి, నరెడ్ల భాస్కరెడ్డి, బండ శ్రీనివాస్, రాజు ఉన్నారు.


రెండోవార్డులో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజుద్దీన్ తదితరులు


6వ వార్డులోని మారుతినగర్‌లో బొట్టుపెట్టి, కరపత్రాలు పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

# జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

హుజూరాబాద్‌టౌన్, నవంబర్18: బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు హుజూరాబాద్‌లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో రెండో వార్డులోని జెండాగద్దె ఏరియా, గణేశ్‌నగర్‌లో, 6వ వార్డు అధ్యక్షుడు కొండపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో మారుతినగర్‌లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లారు. ప్రజలకు కరపత్రాలు పంచారు. అలాగే సర్కారు తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు వివరించారు. కాంగ్రెస్, బీజేపీ ఇతర జాతీయ పార్టీల మోసపూరిత హామీలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో 6వ వార్డులో బల్దియా మాజీ కో ఆప్షన్ సభ్యుడు సబ్బని రమేశ్, నల్ల బాల రాజు, కె.పవన్, కె. క్రాంతి, రెండో వార్డులో శన్న మిర్జా, సమీ ఇర్ఫాన్, అనిల్ పాల్గొన్నారు.


హుజూరాబాద్ సిటీ సెంట్రల్ హాల్‌లో దేవేందర్‌రెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

# అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

వీణవంక, నవంబర్ 18: సీఎం కేసీఆర్ నాయకత్వంలో హుజూరాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కర్ర దేవేందర్‌రెడ్డి, 20 మంది ముస్లింలు, మరో 50 మంది బీజేపీ నుంచి హుజూరాబాద్ సిటీ సెంట్రల్ హాల్‌లో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అతితక్కువ కాలంలోనే తెలంగాణ గణనీయమైన అభివృద్ధి సాధించిందని, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలించిందని తెలిపారు. ప్రతి పేదవారి గడపకు బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని చెప్పారు. హుజూరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడానికి కృషి చేయాలని నూతనంగా పార్టీలో చేరిన వారికి కౌశిక్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి, కోర్కళ్ సర్పంచ్ మర్రి వరలక్ష్మి–స్వామి, ఎంపీటీసీ సంగ స్వరూప–సమ్మయ్య, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ ముత్యాల శంకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు రాకేశ్, నాయకులు అలుగువెళ్లి కోమల్‌రెడ్డి, బాసుమియా, సమ్మయ్య, మునీర్, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్యుత్ సేవలు

- ఏడాది క్రితం పెద్దపాపయ్యపల్లెలో రూరల్-2 కొత్త సెక్షన్ ఏర్పాటు
- వినియోగదారుల్లో హర్షం


పెద్దపాపయ్యపల్లి సబ్ స్టేషన్

హుజూరాబాద్, నవంబర్ 18: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన అనేక సంస్కరణలతో విద్యుత్ రంగం ప్రగతిబాట పట్టింది. స్వరాష్ట్రంలో విద్యుత్ సేవలు మెరుగుపడడంతోపాటు గృహావసరాలు, వ్యవసాయానికి నిరాటంకంగా కరంట్ అందుతుండగా, వినియోగదారుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. గతంలో హుజూరాబాద్ మండల పరిధిలో హుజూరాబాద్‌టౌన్, హుజూరాబాద్ రూరల్ రెండు సెక్షన్లు మాత్రమే ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఏడాది క్రితం పెద్దపాపయ్యపల్లె (రూరల్–2) కేంద్రంగా కొత్త సెక్షన్ ఏర్పాటుతో వాటికి చెక్ పడింది. టౌన్ పరిధిలోని ఇప్పలనర్సింగాపూర్, పెద్దపాపయ్యపల్లి, కాట్రపల్లి, దమ్మక్కపేట గ్రామాలు, రూరల్ పరిధిలోని జూపాక, బొత్తలపల్లి, కనుకులగిద్ద, ధర్మరాజుపల్లి, కందుగుల, చిన్నపాపయ్యపల్లి గ్రామాలను విభజించి పెద్దపాపయ్యపల్లి కేంద్రంగా కొత్తగా సెక్షన్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ఏ సమస్య వచ్చినా సత్వరం పరిష్కారమవుతున్నది.

## గతంలో ఇబ్బందయ్యేది



కరంటు సమస్యవస్తే గతంలో రిపేరు చేసేందుకు సమయం పట్టేది. దీంతో ఇబ్బందయ్యేది. ఇప్పుడలాంటి సమస్యలేదు. ట్రాన్స్‌ఫార్మర్ మీద ఫీజు వైరు ఒకవేళ పోతే... కరంటోళ్లకు చెప్పిన వెంటనే వచ్చి పని చేస్తున్నరు. వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల గురించి ఆలోచిస్తుంది కాబట్టే కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసింది.

*–కాసం రఘుపతిరెడ్డి, రైతు (కందుగుల)*